

సీఎం దంపతులతో ప్రవాస తమిళ చిన్నారులు

రాష్ట్రం శాంతివనం

● అందుకే పెట్టుబడులు

● ఇంగ్లండ్‌లో ప్రవాసీ తమిళులతో సీఎం ● నేడు చెన్నైకి రాక

చెన్నై, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు బేషుగ్గా ఉండటంతో పాటు శాంతివనంగా విరాజిల్లుతోందని, అందుకే పెట్టుబడులు భారీగా వస్తున్నాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. జర్మనీ, ఇంగ్లండ్ పర్యటనల్లో భాగంగా ఆయన ఆదివారం లండన్‌లో ప్రవాస తమిళులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ.. పేదరికం సంకెళ్లు తెంచుకుని ఉన్నత విద్యాభ్యాసం చేయడంతో పాటు ఇక్కడికి వచ్చిన రాష్ట్రవాసులు శ్రమ, పట్టుదలతో ఉన్నతస్థాయికి చేరుకున్నారని అభినందించారు. ముఖ్యంగా ఒక్కో ప్రవాస తమిళుడు తనను తాను పరిచయం చేసుకుని, వారి సొంతూరు పేరును చెబుతుంటే తాను ఉప్పొంగిపోయానన్నారు. అదేసమయంలో తమిళులు ఎక్కడికి వెళ్లినా తమిళ సంస్కృతీ సంప్రదాయాలను ప్రాణంగా భావించి, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయ పరిరక్షణకు కట్టుబడి ఉంటారన్నారు. ఇంగ్లాండ్‌లోని తమిళులు తమ పిల్లలకు అందమైన తమిళ పేర్లు పెట్టుకోవడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. తాను ఒక ముఖ్యమంత్రిగా, విపక్ష నేతగా ఎన్నో దేశాలకు, సదస్సులకు వెళ్లినప్పటికీ ఈ పర్యటన మాత్రం చిరస్మరణీయంగా మిగిలిపోతుందన్నారు. మీరు చూపిన ప్రేమ, ఆదరణ మున్ముందు కూడా కొనసాగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కులం, మతం, పేద, ధనిక లాంటివి మనుషులను వేరు చేస్తున్నాయన్నారు. అయితే, మనల్ని ఏవైతే విభజిస్తున్నాయో వాటిని త్యజించాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. అదేసమయంలో ప్రవాస తమిళులు మాతృభూమికి వచ్చి చేతనైన సాయం చేయాలని కోరారు. ఇక్కడ ఉండే ఉపాధి అవకాశాల గురించి రాష్ట్రంలోని యువతకు వివరించి, వారికి ప్రపంచ తలుపులు తెరిచేలా చేయాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రవాసీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎల్లవేళలా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. గత నాలుగేళ్లలో జనవరి 12న ప్రవాసీ తమిళుల దినోత్సవంగా నిర్వహించామన్నారు. ఈ యేడాది జరిగిన ఈ వేడుకల్లో 62దేశాలకు చెందిన ప్రవాస తమిళులు పాల్గొన్నారని గుర్తుచేశారు. ప్రవాస తమిళుల కోసం ప్రవాసీ తమిళుల సంక్షేమ బోర్డు, టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, రాష్ట్రేతర ప్రాంతాల్లో నివసించే తమిళ ప్రజలకు బీమా సదుపాయం, విదేశాల్లో ఉండే తమిళులకు ఏదేని సమస్య ఉత్పన్నమైతే తక్షణం స్పందించి సాయం చేయడం వంటి ఎన్నో మంచి పనులను తమ ప్రభుత్వం చేస్తుందని సీఎం స్టాలిన్ వెల్లడించారు.

నేడు చెన్నైకి రాక..

రెండు దేశాల పర్యటన కోసం విదేశాలకు వెళ్లిన ముఖ్యమంత్రి స్టాలిన్ తన పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకుని ఈనెల 8న సోమవారం చెన్నైకి చేరుకోనున్నారు. గత నెల 30న ఆయన జర్మనీ, ఇంగ్లండ్ దేశాల పర్యటనలకు వెళ్లిన విషయం తెల్సిందే. తొలుత జర్మనీలో పర్యటించిన ఆయన అక్కడ పలువురు పారిశ్రామికవేత్తలను కలుసుకుని రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చించారు. ఫలితంగా రూ.15,516 కోట్ల పెట్టుబడులపై అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారు. జర్మనీ పర్యటన ముగించుకుని ఆయన ఇంగ్లంగ్ పర్యటనకు వెళ్ళారు. అక్కడ కూడా పారిశ్రామికవేత్తలతో పాటు ప్రవాస తమిళులతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ రెండు దేశాల పర్యటనలను ముగించుకుని సోమవారం ఉదయం 7.30 గంటలకు చేరుకుంటారు. సీఎం స్టాలిన్‌కు స్వాగతం పలికేందుకు డీఎంకే శ్రేణులు సన్నాహాలు చేసుకున్నాయి.

చంద్రగ్రహణాన్ని ఆసక్తిగా

వీక్షించిన రాష్ట్రవాసులు



● ఆలయాల మూసివేత

ప్యారీస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం రాత్రి మొదలై సోమవారం వేకువజామున వరకు కొనసాగిన అరుదైన చంద్రగ్రహణాన్ని రాష్ట్రప్రజలు ఆసక్తిగా వీక్షించారు. ఇందుకోసం స్థానిక కోట్టూరుపురంలోని బిర్లా ప్లానిటోరియం, దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లోని కేంద్ర ప్రభుత్వ ప్లానిటోరియంలలో భారీ టెలిస్కోప్‌ల ద్వారా పర్యాటకులు, ప్రజలు సంపూర్ణ చంద్రగ్రహణాన్ని వీక్షించి ఆనందంలో మునిగితేలారు. కాగా, ఈ ఏడాది ఏకంగా 82 నిమిషాల పాటు చంద్రగ్రహణం కొనసాగిన కారణంగా రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాలను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మూసివేశారు. మదురై మీనాక్షి ఆలయం, సమయపురం మారియమ్మన్ ఆలయం, తంజావూరులో ప్రసిద్ధి చెందిన బృహదీశ్వరాలయం, తూత్తుకుడిలోని తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, రామనాథపురం జిల్లా రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోవిల్‌లోని నాగరాజ ఆలయం, తిరునల్వేలిలోని నెల్లైయప్పర్ ఆలయం, దిండుగల్ జిల్లా పళని క్షేత్రంలోని దండాయుధపాణి ఆలయం, తిరుచ్చి శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయం, సేలం సుఖవనేశ్వరాలయం, స్థానిక టి.నగర్‌లో టీటీడీ శ్రీవారి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయం, తిరువళ్లూరు శ్రీవీరరాఘవ పెరుమాళ్ ఆలయం, తిరుత్తణి మురుగన్ ఆలయం తదితర ప్రసిద్ధి చెందిన ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు నుండి వేకువజామున 1.31 గంటల వరకు మూసివేశారు.

రాష్ట్రంలో బహిరంగ సభలకు బీజేపీ ప్లాన్

● ఆ నాలుగు ప్రాంతాల్లో సభలు ● హాజరుకానున్న అగ్రనేతలు


నరేంద్రమోదీ, అమిత్‌షా

అడయార్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల ప్రచారం కోసం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ భారీ ప్రణాళికలను రచిస్తోంది. రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలను నిర్వహించేందుకు ప్లాన్ చేసింది. చెన్నైతోపాటు మదురై, కోయంబత్తూరు, తంజావూరుల్లో బహిరంగ సభలను నిర్వహించనున్నట్టు తెలిసింది. వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో అధికార డీఎంకే, విపక్ష అన్నాడీఎంకే సారథ్యంలోని కూటమి పార్టీలు పోటీ చేయనున్నాయి. ముఖ్యంగా అన్నాడీఎంకే కూటమి మాత్రం వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ కూటమిలోని బీజేపీ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే దృష్టిసారించింది. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు పలు దఫాలుగా రాష్ట్రంలో పర్యటించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నాలుగు ప్రధాన నగరాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ బహిరంగ సభలకు ప్రధాని తో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర సీనియర్ నేతలను ఆహ్వానించనున్నారు. వీరితో పాటు అన్నాడీఎంకే కూటమి నేతలు కూడా పాల్గొనేలా ప్లాన్ చేస్తున్నారు. మరోవైపు అన్నాడీఎంకే తరపున ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దశలవారీగా పర్యటిస్తూ, డీఎంకే ప్రభుత్వ పనితీరును ఎండగడుతున్నారు. అలాగే, ఆయన పర్యటనకు వెళ్లిన ప్రతి చోటా పార్టీ కార్యకర్తలు, నేతలతో ప్రత్యేకంగా సమావేశమవుతూ, వారిని ఉత్సాహపరుస్తూ ఎన్నికలకు సమాయాత్తం చేస్తున్నారు. అదేవిధంగా భారతీయ జనతా పార్టీ అగ్ర నేతలు కూడా క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ సమావేశాలను నిర్వహిస్తూ, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిస్తున్నారు.

తెలుగు సంస్కృతికి నిలువుటద్దం 'మండలి వెంకట కృష్ణారావు'

● శత జయంతి సభలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి
● అమరజీవి స్మారక మందిరంలో 'ఆధునికీకరించిన గ్రంథాలయం' ప్రారంభం ● అందుబాటులోకి 15 వేల గ్రంథాలు


అతిథులను సత్కరిస్తున్న అనిల్‌కుమార్ రెడ్డి బృందం

ప్యారీస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరంలో, రాజకీయాల్లో, సంఘ సేవలో, తెలుగు భాషాభివృద్ధికి నిస్వార్థ సేవలందించిన మండలి వెంకట కృష్ణారావు తెలుగు సంస్కృతికి నిలువుటద్దమని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో స్థానిక మైలాపూర్ లజ్ కార్నర్‌లో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారకమండపంలో ఆదివారం 'మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభ' ఘనంగా జరిగింది. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రత్యేక అతిథిగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రత్యేక అతిథిగా అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర హాజరయ్యారు. కమిటీ అధ్యక్షుడు కాకుటూరు అనిల్‌కుమార్ రెడ్డి సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు, మండలి వెంకట కృష్ణారావుకు పూలు చల్లి నివాళులర్పించిన అనంతరం స్మారకమండపంలో ఆధునికీకరించిన గ్రంథాలయాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్మారక భవన నిర్వహణ కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ.. రాజధాని నగరం చెన్నైలో ఏపీ ప్రభుత్వ ఆస్తి అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనం శిథిలావస్థలో ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చిందన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సహృదయంతో ముందుకొచ్చి అందించిన రూ.5లక్షలతో గ్రంథాలయాలన్ని ఆధునికీకరించి సుమారు 15వేలకు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. స్మారక భవనం నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించడంతో పాటు లైబ్రేరియన్‌ను కూడా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆయన సభా ముఖంగా విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. మండలి వెంకట కృష్ణారావు పుట్టుక దైవసంకల్పమని, సార్థక జీవితాన్ని గడిపి దివిసీమ గాంధీగా చరిత్రలో నిలిచిపోయిన మహోన్నత వ్యక్తిగా కీర్తించారు. ముఖ్యంగా ఆయన 1977లో దివిసీమ తుఫాను బీభత్సంలో మృతదేహాల వివరాలు తెలుసుకుని, ఆ కుటుంబాలకు అప్పగించడంతో పాటు, మానవీయ విలువలకు అద్దం పట్టారన్నారు. చెన్నైలో ఆ మహనీయుడి శత జయంతి సభలో తాను ముఖ్యఅతిథిగా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సభాముఖంగా మాగుంట కృతజ్ఞతలు తెలిపారు. వెంకట కృష్ణారావు లాగే ఆయన కుమారుడు మండలి బుద్ధప్రసాద్‌కు కూడా తెలుగు భాషపై మమకారమెక్కువని ప్రశంసించారు. స్మారక భవనం అభివృద్ధికి అనిల్‌కుమార్‌రెడ్డి బృందం చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా తెలుగు సాహిత్య సంఘానికి మాగుంట వెన్నెముక లాంటివారని, ఆయన మాతృభాష, తెలుగు కవులు, సాహితీపరులు, అలాగే తెలుగు సంఘాలకు అండగా నిలిచారని తెలిపారు. తెలుగు జాతికోసం, తెలుగు భాష కోసం 58 రోజులు అన్నపానీయాలు ముట్టుకోకుండా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అమరులైన పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడానికి తన తండ్రి ఉభయ తెలుగు రాష్ట్రాల మంత్రిగా, ఎమ్మెల్యేగా కృషిచేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. తెలుగు భాష పరిరక్షణ ద్వారా తెలుగుజాతి అస్తిత్వాన్ని నిలుపుకోవడం ప్రతి తెలుగు కుటుంబం కర్తవ్యం కావాలని సూచించారు. తెలుగు మృతభాష కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రేతర ఆంధ్రులు ఈ జనాభా లెక్కల సమయంలో తమను తెలుగువారిగా నమోదు చేసుకోవాలని, అప్పుడే తెలుగువారి బలం స్పష్టంగా తెలుస్తుందన్నారు. దేశంలో హిందీ తర్వాత రెండో స్థానంలో ఉన్న తెలుగు భాష ఇప్పుడు నాలుగో స్థానంలో ఉండడానికి జనాభా తరుగుదల కారణం కాదని, తెలుగువారిగా నమోదు చేసుకోకపోవడమే ప్రధాన కారణమన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక స్థలాన్ని పలు ప్రాంతాల నుంచి చెన్నైకి వచ్చే ప్రతి తెలుగువారు సందర్శించి స్ఫూర్తిని పొందాలని, ఈ సంస్థ ప్రాభవాన్ని నిలపడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. సీఎంకే రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మండలి వెంకట కృష్ణారావు జీవిత విశేషాలను సభలో ప్రదర్శించారు. భువనచంద్ర తన ప్రసంగంలో తుఫాన్ జలప్రళయంలో అస్తవ్యస్థంగా మారిన అవనిగడ్డను అమరభూమిగా మార్చిన సంస్కర్త మండలి వెంకట కృష్ణారావు అని, ఆయన జీవితం మనకు మార్గదర్శకం కావాలన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి, కోశాధికారి వి. కృష్ణారావు స్వాగతోపన్యాసం చేయగా, సభను గుడిమెట్ల చెన్నయ్య నిర్వహించారు. కమిటీ సంయుక్త కార్యదర్శి పూరా శశికళ అంజనేయులు, సభ్యులు జేఎం. నాయుడు, డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, ఎం.ఎస్. లక్ష్మణ్‌రెడ్డితో పాటు పలు తెలుగు సంఘాల నాయకులు, భాషాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం ఆచార్య విస్తాలి శంకరరావు వందన సమర్పణతో ముగిసింది. అనిల్‌కుమార్‌రెడ్డి కమిటీ తరపున అతిథులను ఘనంగా సత్కరించారు.


ఆధునికీకరించిన గ్రంథాలయ ప్రారంభోత్సవంలో ప్రముఖులు


బిసెంట్‌నగర్ చర్చి ప్రాంగణంలో ఆరోగ్యమాత రథోత్సవానికి హాజరైన భక్తజనం

నేత్రపర్వంగా రథోత్సవం...

భక్తుల పారవశ్యం

కిటకిటలాడిన వేలాంకన్ని, బిసెంట్‌నగర్ క్షేత్రాలు


వేలాంకన్ని పుణ్యక్షేత్రంలో రథోత్సవానికి పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు

ప్యారీస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సెయింట్ వేలాంకన్ని ఆరోగ్యమాత కొలువుదీరిన నాగపట్టినం జిల్లా వేలాంకన్ని, స్థానిక బిసెంట్‌నగర్‌లోని క్షేత్రంలో ఆదివారం రాత్రి నేత్రపర్వంగా రథోత్సవం సాగింది. ఈ వైభవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొని మేరీమాత దివ్యస్వరూపాన్ని దర్శించుకుని పులకించిపోయారు. రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో వేలాంకన్ని, బిసెంట్‌నగర్ క్షేత్రాలు కిటకిటలాడాయి. ఈ రెండు ఆలయాల్లో గత నెల 29న పతాకావిష్కరణతో వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. 10 రోజుల ఉత్సవాల్లో ప్రధానాంశమైన రథోత్సవం ఆదివారం సాయంత్రం 7 గంటలకు క్యాథలిక్ బిషప్‌లు, ఫాదర్ల ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభమైంది. విద్యుత్ దీపాలు, వివిధ పూలతో అలంకరించిన రథంలో బాలయేసుతో వేలాంకన్ని ఆరోగ్యమాత విగ్రహాన్ని కొలువుదీర్చి పురవీధుల్లో నేత్రపర్వంగా ఊరేగించారు. రద్దీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, హోంగార్డులు, అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వహించారు. కాగా, భక్తుల సౌకర్యార్థం దక్షిణ రైల్వేశాఖ 8 ప్రత్యేక రైళ్లు, తమిళనాడు రవాణా సంస్థలు 5 ప్రత్యేక బస్సులను వేలాంకన్నికి నడిపాయి. అదేవిధంగా బిసెంట్‌నగర్‌కు మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎంటీసీ) అదనపు సిటీ బస్సులు నడిపింది. సోమవారం మేరీమాత పట్టాభిషేకం, సాయంత్ర పతాక అవనతంతో వార్షికోత్సవాలు ముగుస్తాయని, ఈ చర్చిల నిర్వాహకులు తెలిపారు.

పెళ్లి తర్వాత ఎక్స్‌పోజింగ్
తప్పులేదు
● రకుల్ ప్రీత్ సింగ్ 7

కరోనా తర్వాత పెరిగిన
గుండె సంబంధిత సమస్యలు
● మంత్రి ఎం.సుబ్రమణ్యం 7

6 పుత్తాగరం
ఆలయ రథానికి నిప్పు

సమాచార దృష్టి

మూడు రెట్లు పెరిగిన మదురై-చెన్నై విమాన చార్జీ

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల కారణంగా మదురై-చెన్నై విమాన చార్జీ మూడు రెట్లు పెరిగింది. సాధారణంగా మదురై-చెన్నై విమానచార్జీ రూ.4,200కాగా, ఆదివారం రూ.14,114కు పెరిగింది. ఛార్జీ పెంపుపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రయాణికులు, సెలవు రోజుల్లో విమాన ఛార్జీల పెంపును అడ్డుకొనేలా పౌర విమానయాన సంస్థ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గృహ విద్యుత్ కనెక్షన్‌లో పేరు మార్పునకు నూతన విధానం

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ కనెక్షన్‌లో పేరు మార్పునకు నూతన విధానాన్ని విద్యుత్ బోర్డు పరిచయం చేసింది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... గృహ విద్యుత్ కనెక్షన్‌లో పేరు మార్చాలని పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో పేరు మార్పులో జాప్యం జరుగుతోందని తెలిపింది. ఈ ప్రక్రియ వేగవంతం చేసేలా, మునుపటి యజమాని అంగీకారం కోరే ఫారం-2 దరఖాస్తుల నుంచి పొందాల్సిన అవసరం లేదని పేర్కొంది. అలాగే, విక్రయ దస్తావేజు, ఆస్తి పన్ను రసీదు, కోర్టు తీర్పు తదితరాలు, అనుమతి లేఖ, కుటుంబ పెద్ద మృతిచెందితే పేరు మార్పు కోసం వారసత్వ ధృవీకరణ పత్రం, ఇటీవల పొందిన ఆస్తి పన్ను రసీదు తదితరాలు సమర్పిస్తే సరిపోతుందని, ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించేలా చీఫ్ ఇంజనీర్లు చర్యలు చేపట్టాలని విద్యుత్ బోర్డు సూచించింది.

కపాలీశ్వర ఆలయంలో వేదపారాయణంపై శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాదాయ శాఖ ఆధీనంలోని స్థానిక మైలాపూర్ కపాలీశ్వర ఆలయం నిర్వహిస్తున్న వేదపారాయణం శిక్షణ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతి ఉత్తీర్ణులై 14 నుంచి 24 ఏళ్లలోపున్న వారు అర్హులు. శిక్షణలో చేరే విద్యార్థులకు ఆహారం, దుస్తులు, బసతో పాటు ప్రోత్సాహక వేతనంగా రూ.10,000 అందించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://mylaikapaleeswarar.hrce.tn.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వాహక అధికారి తెలిపారు.

రవాణా శాఖ మాజీ ఉద్యోగులకు డీఏ పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మాజీ ఉద్యోగులకు 18 శాతం డీఏ పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత 2016 సెప్టెంబరు 1వ తేది ముందు పదవీ విరమణ పొందిన వారికి 18 శాతం, అనంతరం పదవీ విరమణ పొందిన వారికి 9 శాతం డీఏ పెంచారు. ఆ ప్రకారం, రూ.2,000 నుంచి రూ.4,000 వరకు పింఛన్ పెరగనుందని, ఈ పెంపుతో 93,000 మంది మాజీ ఉద్యోగులు లబ్ధిపొందుతారని రవాణా శాఖ తెలిపింది.

చెన్నైలో 22 రోడ్లపై దుకాణాల ఏర్పాటుకు నిషేధం

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 22 ప్రధాన రోడ్ల పక్కన దుకాణాల ఏర్పాటుకు అనుమతి లేదని అధికారులు పేర్కొన్నారు. ఈ విషయమై జీసీసీ అధికారులు మాట్లాడుతూ... ఫుట్‌పాత్ వ్యాపారులను గుర్తించి గుర్తింపు కార్డులు అందజేస్తున్నామన్నారు. ఆ ప్రకారం, సుమారు 33 వేల మందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశామన్నారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని వళ్లువర్‌కోట్టం, వాలాజా రోడ్డు, గ్రీన్‌వేస్ రోడ్డు, టీటీకే రోడ్డు, నెల్సన్ మాణిక్యం రోడ్డు, అన్నాసాలై, పూందమల్లి హైరోడ్డు, ఆర్కాడు రోడ్డు, జీఎస్‌టీ రోడ్డు సహా 22 రోడ్ల పక్కన దుకాణాల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. పాఠశాలలు, మెడికల్ షాపులు ఉన్న రోడ్లపై 100 మీటర్ల దూరం, ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు, బస్సు రవాణా మార్గాలు తదితరాల నుంచి 150 మీటర్ల దూరంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతి లేదని తెలిపారు. అనుమతి లేకుండా ఉన్న దుకాణాల తొలగింపునకు నలుగురు అధికారులతో కూడిన బృందాన్ని ఏర్పాటుచేసినట్టు తెలిపారు. అన్నా నగర్ తదితర ప్రాంతాల్లో 70కి పైగా దుకాణాలు తొలగించినట్లు జీసీసీ అధికారులు తెలిపారు.

పాఠశాల ఉపాధ్యాయులకు 'ఏఐ'పై ఉచిత విద్య

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఉపాధ్యాయులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) నైపుణ్యాలపై ఉచిత శిక్షణను మద్రాసు ఐఐటీ పరిచయం చేసింది. మద్రాసు ఐఐటీ ఇటీవల 'స్వయం ప్లస్' ప్రాజెక్ట్ కింద అందరికీ ఏఐ విద్యను అందిస్తోంది. ఈ ఉచిత స్వల్పకాలిక కోర్సులు ఉపాధ్యాయులకు బోధనా కార్యక్రమాలతో పాటు కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఎలా ఉపయోగించాలో నేర్పనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు, ఉపాధ్యాయులు https://swayamplus.swayam2.ac.inలో ఈనెల 30వ తేది లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.


వేలూరులో 400 కిలోల గుట్కా స్వాధీనం

వేలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి రైల్వేస్టేషన్‌లో 400 కిలోల నిషేధిత గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దుల నుండి గుట్కాను తరలిస్తున్నట్లుగా అందిన సమాచారంతో నిఘా వేసిన పోలీసులు అనుమానాస్పదంగా ఆటోలో సంచరిస్తున్న విక్రమ్‌ని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. ఆటోలో సుమారు 400 కిలోల గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు అతడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి సమీపంలో బైక్, ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. లోకేష్, సంతోష్, సాధిక్‌లు ఆదివారం ఉదయం ఒకే మోటారు బైక్‌లో తిరునల్వేలి బయల్దేరారు. తిరునల్వేలి జంక్షన్ రోడ్డు ఈరోడ్ ఫ్లై ఓవర్ సమీపంలో అతివేగంగా వచ్చిన బైక్, ప్రభుత్వ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

తిరువణ్ణామలై క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

ఆలయ మాడవీధుల్లో పోటెత్తిన భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేలూరు,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):ఆవణి పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం తిరువణ్ణామలైలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ శైవక్షేత్రం అన్నామలైయార్ ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. తమిళనాడు సహా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ నుంచి భక్తులు శనివారమే ఆలయానికి తరలివచ్చారు. రాష్ట్ర రవాణాశాఖ ఆలయానికి ప్రత్యేక బస్సులను నడిపింది. ఆదివారం తెల్లవారుజాము 3 గంటల నుంచే గిరిప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు బారులు తీరారు. ప్రదక్షిణ పూర్తయిన అనంతరం స్వామివార్ల దర్శనానికి సుమారు ఐదు గంటలసేపు భక్తులు క్యూలైన్లలో వేచివుండి ఉన్నామలైయమ్మన్ సమేత అన్నామలైయార్‌లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

17వ శతాబ్దపు చంద్రగ్రహణ శాసనం లభ్యం



లభ్యమైన శిలా శాసనం

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని పెరియనాయకి అమ్మవారి ఆలయ ప్రాంతంలో 17వ శతాబ్దపు చంద్ర గ్రహణాన్ని సూచించే శాసనం లభ్యమైందని పురావస్తు పరిశోధకుడు నారాయణమూర్తి తెలిపారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ... పళని పెరియనాయకి అమ్మవారి ఆలయంలో యాగశాల భవనం ఉందని, ఆ ప్రాంతంలోని ఒక శాసనం నాలుగు పంక్తులు మాత్రమే కలిగి ఉందన్నారు. చంద్ర గ్రహణం రోజున ఆలయానికి ఇచ్చిన విరాళాన్ని ఈ శాసనంలో ప్రస్తావించారని తెలిపారు. ఆధునిక కాలంలో సైన్స్ అభివృద్ధి చెందడంతో, గ్రహణాలను గుర్తించడం సులభతరమని, ప్రాచీన కాలంలో తమిళ పండితులకు గ్రహణాలను ముందుగానే అంచనా వేయగల ఖగోళ జ్ఞానం ఉందని ఈ శాసనం రుజువు చేస్తోందన్నారు. గ్రహణ సమయంలో దేవాలయాలకు దానాలు చేయడం వల్ల అనేక రెట్లు మంచి జరుగుతుందని పురాతన కాలం నుంచి నమ్మేవారని తెలిపారు. దానికి ఎవరిచ్చారు? ఏ బహుమతి ఇచ్చారు? అప్పుడు ఎవరు పాలించారు? అనే దాని గురించి స్పష్టమైన వివరాలు అందుబాటులో లేవన్నారు. ఈ శిలా శాసనం ఏదో కారణం చేత విరిగిపోయిందని, 19వ శతాబ్దంలో ఆలయాన్ని పునరుద్ధరించినప్పుడు యాగశాల నిర్మించిన ప్రదేశంలో శాసనం ఉందని ఆయన తెలిపారు.

రోడ్డు నిర్మాణం పనులను పూర్తిచేయండి

● పంచాయతీ అధ్యక్షురాలు సెల్వప్రియ



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ అధికారులు

వేలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పళ్లికొండ పంచాయతీ పరిసర ప్రాంతాల్లో రూ.3.34 కోట్లతో చేపట్టిన నూతన రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఉదయం పంచాయతీ అధ్యక్షురాలు సెల్వప్రియ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, నాణ్యతలో రాజీవద్దని తెలిపారు. నిర్మాణం విషయమై ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహణాధికారి ఉమారాణి, పంచాయతీ ఉపాధ్యక్షుడు అక్రమ్, కౌన్సిలర్ కుమరన్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో నలంకాక్కుమ్ స్టాలిన్ శిబిరం



కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కోనవట్టమ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో నలంకాక్కుమ్ స్టాలిన్ వైద్యశిబిరం జరిగింది. గ్రామంలోని ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నలంకాక్కుమ్ స్టాలిన్ శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వేలూరు మేయర్ సుజాతా ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తాగరం ఆలయ రథానికి నిప్పు

● గ్రామంలో ఉద్రిక్తత



రథానికి నిప్పు....

చెన్నై, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పుత్తాగరంలో కొలువై ఉన్న ముత్తుసోలక్షి అమ్మన్ ఆలయానికి చెందిన రథానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు ఈ వ్యవహారం ఆ గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సుమారు వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం హిందూ దేవాదాయశాఖ ఆధీనంలో ఉంది. యేటా ఆలయంలో నిర్వహించే ఆడి నెల వేడుకల్లో అమ్మవారి వీధి ఉత్సవం నిర్వహిస్తుంటారు. రథం శిథిలావస్థకు చేరడంతో సుమారు 40 ఏళ్లుగా ఉత్సవం జరగడం లేదు. ఈ క్రమంలో కొత్త రథం నిర్మాణానికి రూ.28.40 లక్షలు కేటాయించి జూలై లో పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రథం నిర్మాణం పూర్తి కాగా, త్వరలో రథోత్సవం నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో, ఉత్సవం సమయంలో రథం తమ ప్రాంతం మీదుగా వెళ్లాలని ఒక వర్గం వారు పట్టుబడుతుండగా, మరో వర్గం దాన్ని వ్యతిరేకిస్తోంది. 40 ఏళ్ల క్రితం ఉన్న ఆచారాన్నే పాటిస్తామని ఆ వర్గం చెబుతోంది. ఈ కారణంగా రెండు వర్గాల మధ్య విభేదాలు పొడసూపాయి. ఈ క్రమంలో, ఇరువర్గాలు తమ వాదనల్ని జిల్లా కలెక్టర్‌కు వినిపించారు. అంతేగాక మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో, ఈనెల 5వ తేది నిర్వహించాల్సిన రథోత్సవం, ఇరువర్గాల అభ్యంతరాలతో నిలిపివేశారు.

కొత్తగా తయారుచేసిన రథాన్ని టార్పాలిన్‌తో మూసి ఉంచారు. ఈ క్రమంలో, శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రథానికి నిప్పంటించి పరారయ్యారు. మంటల్లో రథంపై వేసిన టార్పాలిన్ పూర్తిగా దగ్ధమైంది. చుట్టుపక్కల వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేయగా, రథం స్వల్పంగా దెబ్బతింది. ఈ విషయం తెలిసి ఆదివారం గ్రామంలోని ఇరువర్గాలు అక్కడ గుమిగూడాయి. నిప్పంటించిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలంటూ ధర్నా చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న వాలాజాబాద్ పోలీసులు.. ఆందోళనకారులను శాంతింపజేయించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ ఘటన కారణంగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు.

అన్నాడీఎంకేతోనే అభివృద్ధి సాధ్యం : ఈపీఎస్



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈపీఎస్

ప్యారీస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమై ప్రజలు అన్ని విధాలా లబ్ధి పొందారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యాఖ్యానించారు. 'మక్కలై కాప్పోం - తమిళగత్తై మీట్పోం' నినాదంతో కోవై జిల్లా మేట్టుపాళయంలో జూలై 7న ప్రారంభమైన ఈపీఎస్ ప్రచారయాత్ర ఆదివారం దిండుగల్ జిల్లా నత్తం నియోజకవర్గానికి చేరుకుంది. మాజీమంత్రి నత్తం విశ్వనాథన్ ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో శ్రమిస్తున్న కార్మికులకు డీఎంకే ప్రభుత్వం కూలీలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. గృహిణులకు ప్రతి నెలా రూ.1000 పంపిణీ పథకాన్ని పరిచయం చేసింది అన్నాడీఎంకే ప్రభుత్వమేనని, అయితే ఈ పథకంతో పాటు కొన్ని కేంద్రప్రభుత్వ పథకాలకు స్టిక్కర్లు అంటించి డీఎంకే ప్రభుత్వం తమవని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అన్నాడీఎంకే అధికారంలో ఉన్నా, లేకున్నా.. ప్రజల పక్షాన నిలబడుతుందని, తమ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమైందన్న వాస్తవాన్ని ప్రజలు మర్చిపోరన్నారు. డీఎంకేలో ఒకే కుటుంబానికి చెందిన వారసులకు మాత్రమే పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ప్రాధాన్యం ఉంటుందని, సీనియన్ మంత్రి ఐ.పెరియస్వామి తదితరులకు తగిన గుర్తింపు ఉండదన్నారు. అలాగే అన్నాడీఎంకే నుంచి డీఎంకేలో చేరిన నేతల్లో పలువురి చిరునామా గల్లంతయ్యిందన్నారు. అయితే అన్నాడీఎంకేలో సామాన్య కార్యకర్తలు కూడా తనలాగా పార్టీ పదవులు, అధికార బాధ్యతలు స్వీకరించగలుగుతున్నారని ఈపీఎస్ అన్నారు.

కాట్పాడిలో కంటి వైద్య ఉచిత శిబిరం



శిబిరంలో నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి గాంధీనగర్‌లోని ఆర్‌వి సీటీ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కంటి వైద్య ఉచిత శిబిరం, రక్తదాన శిబిరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్ కుమార్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాణం పోసిన దేవుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న మరొకరికి సాయం చేసే అవకాశాన్ని రక్తదాన రూపంలో అందించాడన్నారు. ప్రతి ఒక్కరు ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అస్‌రబ్, వేలూరు బ్లడ్ బ్యాంక్ ఆర్గనైజర్ శివన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ బోర్డు తెలిపింది.

● **మీంజూరు**: టీహెచ్ రోడ్డు, తేరడి వీధి, సిరువాక్కం, సూర్య నగర్, బీడీఓ ఆఫీసు, వన్నిపాక్కం, సీమావరం, ఆర్-ఆర్ పాళయం, అరియాన్‌వాయల్, పుదుపేడు, నందియంబాక్కం, మేలూరు, పట్టామందిరి, వల్లూరు, అత్తిపట్టు, ఎస్ఆర్ పాళయం, జీఆర్ పాళయం, కొండకరై, పల్లిపురం, వళుతింగైమేడు, కారాయనమేడు.

● **అన్నాసాలై:** అంగప్పన్ వీధి, మూర్ వీధి, 2వ లైన్ బీచ్ రోడ్డు, లింగిచెట్టి వీధి, స్టాండర్డ్ ఛార్టెడ్ బ్యాంక్, ఎర్రబాలు వీధి, లాన్ బీచ్ రోడ్డు, మూకర్ నల్లముత్తు వీధి, మూర్ వీధి, అంగప్పన్ వీధి, స్టాక్ ఎక్స్చేంజ్, ఇండియన్ బ్యాంక్ 1,2, జీసస్ కాల్స్, హెచ్ఎస్‌బీసీ, యూటీఐ, తంబుచెట్టి వీధి, లింగిచెట్టి వీధి, ఆర్మేనియం వీధి, అడిషనల్ లా ఛాంబర్, ఎస్ప్లనేడు రోడ్డు, ఎస్ఎస్‌సీ బోస్ రోడ్డు, బద్రియన్ వీధి, బందర్ వీధి, మాలాయపెరుమాళ్ వీధి, అండర్సన్ వీధి, స్ట్రింగర్ వీధి, యుంబర్సన్ వీధి, కురళగం, లా కాలేజ్ పంపింగ్ స్టేషన్, ఎంఎంసీ మెన్స్ హాస్టల్.

● **కొరట్టూరు:** మన్నూరుపేట, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎంటీహెచ్ రోడ్డు, పాడి, మొగప్పేర్ రోడ్డు, టీఎస్‌హెచ్‌బీ, కేఆర్ నగర్, తిల్లై నగర్, కన్నగి నగర్, జంబుకేశ్వరర్ నగర్.

● **పోరూర్:** అయ్యప్పన్‌తాంగల్, ఆర్ఆర్ నగర్, కాట్టుకుప్పం, పుష్పా నగర్, వేణుగోపాల్ నగర్, అన్నై ఇందిరా నగర్, వలసరవాక్కం, పోరూర్ గార్డన్ ఫేస్ 1,2, రామస్వామి నగర్, అర్బన్ ట్రీ, ఆర్కాట్ రోడ్డు, ఎంఎం ఎస్టేట్, జీకే ఎస్టేట్, చిన్నపోరూర్, వానగరం, భరణిపుదూర్, కారంబాక్కం, సమయపురం, పొన్ని నగర్, చెట్టియార్ అగరం, పూందమల్లి రోడ్డు, పెరియ కొలుత్తువాంజేరి, మధురం నగర్, తిల్లైయార్ అగరం.

మరణంలో అమరత్వాన్ని పొందారు

● ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం



నివాళులర్పిస్తున్న మంత్రి సుబ్రమణ్యం తదితరులు

తిరుత్తణి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆవడి సమీపంలోని మోరై ప్రాంతానికి చెందిన చెల్లయప్పన్ (53)గత నెల 27న ప్రమాదానికి గురై చెన్నై కీల్పాక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. ఈ నేపథ్యంలో, చెల్లయప్పన్ మెదడు నిర్జీవమైన కారణంగా అతని కుటుంబసభ్యుల అంగీకారంతో వైద్యులు ప్రత్యేక చికిత్స ద్వారా అవయవాలను తొలగించి చెన్నైలోని పలు ఆస్పత్రులకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం ఆస్పత్రికి వెళ్లి చెల్లయప్పన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చెల్లయప్పన్‌తో సహా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 500 అవయవ దానాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ డైరెక్టర్ తేరణీరాజన్, అవయవదాన విభాగ కమిషనర్ గోపాలకృష్ణన్, ఆర్డీవో రవిచంద్రన్, కీల్పాక్ వైద్యశాల సిబ్బంది సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్టు

తిరుత్తణి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో యువకుడిపై దాడి చేసిన సంఘటన పొదటూరుపేటలో జరిగింది. తిరువళ్లూరు జిల్లా పొదటూరుపేటకు చెందిన బాలమురుగన్ అదే ప్రాంతంలో మొబైల్ సర్వీస్ దుకాణం నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో అతడికి యువతితో పరిచయం ఏర్పడి ఆ పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో యువతికి బంధువైన దేవ మరో ఇద్దరు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి బాలమురుగన్ తన మిత్రుడు జ్యోతిలింగంతో రోడ్డుపై మాట్లాడుతుండగా దాడికి పాల్పడ్డారు. దీంతో వారిద్దరు తీవ్రగాయాలతో స్పృహ కోల్పోయారు. అదే సమయంలో ఆ మార్గంలో వెళుతున్న ప్రజలు అది చూసి పెద్దగా కేకలు వేయడంతో నిందితులు అక్కడినుండి పరారయ్యారు. వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి కేవలం 24 గంటల్లోనే ఎస్ఐ సుగంధి నేతృత్వంలోని పోలీసు బృందం నిందుతులను అరెస్టు చేసింది. విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా పాలసముద్రంలోని తొట్టికండ్రిగకు చెందిన దేవ, బన్నీ, కిషోర్‌గా పోలీసులు గుర్తించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

పార్శిల్‌లో గ్యాస్ సిలిండర్లు: ఒకరి అరెస్టు

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైల్వే పార్శిల్‌లో గ్యాస్ సిలిండర్ పంపిన వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుచ్చి జంక్షన్‌లో ఈ నెల 4వ తేది పార్శిల్‌లో వచ్చిన వస్తువులను రైల్వే పోలీసులు తనిఖీ చేశారు. ఆ సమయంలో, రెండు గ్యాస్ సిలిండర్లను, ఇంటి గృహోపకరణాలు అని నమోదుచేసి, పాలిథీన్ సంచిలో ఉంచడాన్ని గుర్తించారు. నాగర్‌కోయిల్ నుంచి తిరుచ్చికి ఈ సిలిండర్లు పార్శిల్‌లో పంపినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. ఈ వ్యవహారంలో రసీదు పేర్కొన్న కరూర్ జిల్లాకు చెందిన మురళిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ సస్పెన్షన్

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఎస్ఐ, మహిళా పోలీసుపై సస్పెన్షన్ వేటుపడింది. తూత్తుకుడి జిల్లా కోవిల్ పట్టి ట్రాఫిక్ విభాగ ఎస్ఐ సెల్వకుమార్, అదే విభాగంలో పనిచేస్తున్న లేడి కానిస్టేబుల్ ఇందిరా గాంధీతో సన్నిహితంగా ఉండేవారు. ఈ క్రమంలో, గత నెల 17వ తేది నడిరోడ్డులో ఇద్దరు వాగ్వాదానికి దిగారు. ఈ వ్యవహారంపై స్పందించిన అధికారులు, సెల్వకుమార్‌ను తిరుచెందూర్‌కు, ఇందిరాగాంధీని పులియంపట్టి బదిలీ చేశారు. ఈ క్రమంలో, తనను సెల్‌ఫోన్‌లో సెల్వకుమార్ బెదిరిస్తున్నాడని ఇందిరాగాంధీ కోవిల్‌పట్టి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సెల్వకుమార్‌ను సస్పెండ్ చేస్తూ తిరునల్వేలి డీఐజీ సంతోష్ హసి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారంటూ, కానిస్టేబుల్ ఇందిరా గాంధీని కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు.

మెట్రో రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

● బాలుడి అరెస్ట్

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపునకు పాల్పడిన బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చెన్నై మెట్రో రైల్వేస్టేషన్‌కు ఈనెల 5వ తేది వచ్చిన ఫోన్ కాల్‌లో మాట్లాడిన వ్యక్తి, రైల్వేస్టేషన్‌లో బాంబు ఉంచినట్లు పేర్కొని ఫోన్ కట్ చేశాడు. రైల్వేస్టేషన్ అధికారుల సమాచారంతో అక్కడికి చేరుకున్న బాంబ్ స్క్వాడ్ స్టేషన్, ప్రాంగణంలో తనిఖీలు చేపట్టి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన కోయంబేడు పోలీసులు, బాంబు బెదిరింపుకు పాల్పడిన విల్లుపురానికి చెందిన 17 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రోడ్డు రోలర్ కింద పడి దివ్యాంగుడి మృతి



పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులో రోడ్డు రోలర్ కింద పడి భార్య కళ్లెదుటే దివ్యాంగుడు మృతిచెందాడు. కోయంబేడు పిళ్లయార్ వీధికి చెందిన భాస్కర్ రాజ్ (55) దివ్యాంగుడు. ఆయన భార్య శాంతలక్ష్మితో కలసి శనివారం సాయంత్రం ఆ ప్రాంతంలోని వినాయకుడి ఆలయం సమీపంలో నిలబడ్డి ఉన్నాడు. ఆ సమయంలో, వారి ముందు రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఊహించని విధంగా ముందుకు వెళ్లాల్సిన రోడ్ రోలర్ వెనక్కి రాగా, దాని చక్రం కింద పడి భాస్కర్‌రాజ్ ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. శాంతలక్ష్మి స్పృహ తప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కోయంబేడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళపై లైంగిక దాడి:యువకుడి అరెస్టు

వేలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పనమ్‌తోపు ప్రాంతానికి చెందిన మహిళపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళను శనివారం రాత్రి ఇమ్రాక్ లైంగికంగా వేధించాడు. మహిళ ఫిర్యాదుతో పనమ్‌తోపు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నీట మునిగిన వారికి రక్షించేలా మాక్ డ్రిల్



పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా తిరుచ్చుళి సమీపంలోని జలాశయాల్లో నీట మునిగిన వారిని రక్షించేలా అగ్నిమాపక సిబ్బంది శనివారం మాక్ డ్రిల్ నిర్వహించారు. జలాశయాలు, వరదల్లో చిక్కుకున్న వారిని అగ్నిమాపక శాఖ, విపత్తుల నివారణ బృందాలు రక్షిస్తుంటాయి. వారు వెళ్లేలోగా బాధితులు మృతి చెందే అవకాశాలున్నాయి. దీన్ని అడ్డుకునేలా అగ్నిమాపక శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఆలడిపట్టి శివార్లలోని క్వారీలో నీట మునిగిన వారిని రక్షించడం, ప్రాథమిక చికిత్సలందించడం తదితరాలపై అవగాహన కల్పించారు.

ఆస్తి వివాదంలో మహిళను వివస్త్రను చేసి దాడి

అడయార్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా బన్రుట్టి సమీపంలోని నెల్లితోపు మారియమ్మన్ ఆలయ వీధికి చెందిన మహిళను ఆమె కుటుంబ సభ్యులే వివస్త్రను చేసి, చెట్టుకు కట్టేసి కొట్టారు. పోలీసుల కథనం మేరకు...ఈ ప్రాంతానికి చెందిన రామర్ (63)కి బంధువులైన జయంతి, చిన్నయాల్, వైదీశ్వరన్, అనురాధతో ఆస్తి గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో రామర్, ఆయన సోదరుడు సింగారవేల్ భార్య సెల్వరాణిని వివస్త్రను చేసి చెట్టుకు కట్టేసి చితకబాదారు. ఈ దాడిలో రామర్, సెల్వరాణి గాయపడగా, వారిని బన్రుట్టి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కండంబలియూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.



'గోల్డ్ కాల్'లో ఓ దృశ్యం

సస్పెన్స్, కామెడీ డ్రామాగా 'గోల్డ్ కాల్'

డెబ్యూ డైరెక్టర్ తంబిదురై దర్శకత్వంలో రూపొందిన 'గోల్డ్ కాల్' సస్పెన్స్, కామెడీ, డ్రామా జానర్‌లో రూపొందించారు. తాజాగా చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు. వాక్త్రూ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మాత కేశవమూర్తి నిర్మించారు. ఈ సినిమాపై దర్శకుడు తంబిదురై మాట్లాడుతూ... 'హాస్యం వివిధ కోణాల్లో వ్యక్తీకరించవచ్చు. ఫన్నీ సంఘర్షణలు, విరుద్ధమైన వ్యక్తిత్వాలు, కొంచెం వింతైన సంఘటనల సమాహారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఎమోషన్స్ కష్టమైన లక్షణాలు ఇమిడివుంటాయి. అలాగని రొటీన్ కామెడీ చిత్రం తరహాలో ఉండదు. ఇందులోని ప్రతి సన్నివేశం వాస్తవికంగా ఉంటుంది. పాత్రల తీరు సహజసిద్ధంగా ఉంటాయి' అని పేర్కొన్నారు. నిర్మాత కేశవమూర్తి మాట్లాడుతూ... 'ఈ చిత్ర విశేషాలను పంచుకోవడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం బాగా వచ్చేందుకు శ్రమించిన నటీనటులకు ధన్యవాదాలు. ఈ చిత్రం ఈ యేడాది ఇప్పటివరకు విడుదలైన మంచి చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుంది' అని పేర్కొన్నారు. కాగా, ఈ చిత్రంలో సిద్ధు మూలిమణి, సంతోష్ ఎస్స్ర, శ్రీ వైష్ణవ్, కృష్ణ విజయచంద్రన్, బాలాజీ రాజశేఖర్, శ్రీకాంత్, అమిత రంగనాథ్, నిషా హెగ్డే, కీర్తనా పుల్కి తదితరులు నటించగా, కెమెరా జీఎస్ శరవణన్. సంగీతం ప్రణవ్ గిరిధరన్.

స్వయంకృషితో రాణిస్తా

● యువ నటుడు శర్వా

చిత్రజ్యోతి

తాను ఎవరి సహాయం తీసుకోకుండా స్వయంకృషితో చిత్రపరిశ్రమలో రాణించాలన్న పట్టుదలతో ఉన్నట్టు యువ నటుడు శర్వా చెప్పారు. ఆయన తన సినీ ప్రయాణంపై విలేకరులతో మాట్లాడుతూ... 'నేను న్యాయ విద్యను పూర్తి చేశా. కాలేజీ చదువుకునే రోజుల నుంచి నటనపై ఆసక్తి ఉంది. అందుకే చిన్నచిన్న స్టేజ్ షోలతో పాటు షార్ట్ ఫిల్మ్స్‌లో నటించా. నటనలో తర్ఫీదు పొందాను. 2012లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ 2017లో నాకు తొలి అవకాశం వచ్చింది. దర్శక, నిర్మాత వెంకట్ ప్రభు నిర్మించిన 'ఆర్‌కే నగర్'లో తొలిసారి వెండితెరపై కనిపించా. ఆ తర్వాత 'తమిళ్ రాకర్స్'లో నటించా. 'హార్ట్ బీట్' తమిళ వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకుల మనసుల్లో గుర్తింపుతో పాటు స్థానం సంపాదించా. ఇందులో గుణ పాత్రలో నటించా. ఆ తర్వాత నా స్నేహితులు, బంధువులంతా నన్ను 'గుణ'గా పిలవడం మొదలుపెట్టారు. ఇది ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. వెబ్ సిరీస్‌లో లభించిన గుర్తింపు, క్రేజ్‌తో సినిమాల్లో నటించేందుకు ప్రయత్నిస్తున్నా. ఈ కోవలోనే అధర్వ మురళి హీరోగా నటించిన 'తణల్'లో హీరో స్నేహితుడిగా నటించాను. 'తణల్' చిత్రం ఈ నెల 12న విడుదలకానుంది. హీరోగా ప్రయత్నించడం కంటే ముందు నన్ను నేను నటుడిగా నిరుపించుకోవాల్సి ఉంది. అందుకే నెగెటివ్ షేడ్స్ ఉన్నపాత్రలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నా. సినిమాల్లో నిలదొక్కుకున్న తర్వాత హీరోగా ప్రయత్నిస్తాను' అని వెల్లడించారు.



సైకో థ్రిల్లర్‌గా 'ఇరవిన్ విళిగల్'

మహేంద్ర ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై రూపొందిన 'ఇరవిన్ విళిగల్'ను సైకో థ్రిల్లర్‌గా రూపొందించారు. చిక్కల్ రాజేష్ దర్శకుడు. మహేంద్ర హీరో. కన్నడ నటి నీమా రే హీరోయిన్. ఇతర పాత్రల్లో నిళల్ గల్ రవి, మస్కారా అస్మిత, గుంతాజ్, అన్ని చేరణ్ రాజ్, సిసర్ మనోహర్, ఈశ్వర్ చంద్ర ప్రభు, కిలి రామచంద్రన్ తదితరులు నటించారు. ఈ చిత్రం ప్రేక్షకులను సీట్ ఎడ్జ్ థ్రిల్లింగ్‌కు గురిచేసేలా రూపొందించారు. ఈ మూవీకి సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్‌ను మంజూరు చేసింది. త్వరలో ఆడియో, ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. వెల్లిమలై అటవీ ప్రాంతంలో చిత్రీకరణ జరుపుకుంది. సాధారణంగా ఈ ప్రాంతంలో పర్యటించేందుకు పర్యాటకులు సైతం వెనుకంజ వేస్తారు. అలాంటిది ఈ చిత్ర బృందం ఆ అటవీ ప్రాంతంలో షూటింగ్ పూర్తి చేయడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఏఎం అజార్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి భాస్కర్ కెమెరామెన్‌గా పనిచేశారు.



'ఇరవిన్ విళిగల్'లో మహేంద్ర, నీమా రే



పెళ్లి తర్వాత ఎక్స్‌పోజింగ్ తప్పులేదు

● రకుల్ ప్రీత్ సింగ్

వివాహం తర్వాత గ్లామర్‌గా కనిపించడం, ఎక్స్‌పోజింగ్ చేయడంతో తప్పులేదని, అసలు పెళ్లి తర్వాతే మరింత గ్లామర్ వస్తుందని హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ అంటున్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తూ బిజీ హీరోయిన్‌గా ఉన్న రకుల్... ఓ ఇంటికి కోడలైన విషయం తెల్సిందే. పెళ్లి తర్వాత కూడా ఆమె సినిమాల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... 'ఎక్స్‌పోజింగ్ హీరోయిన్స్‌ల కెరీర్ పురోభివృద్ధికి ఏమాత్రం అడ్డంకికాదు. నేను మాత్రం వివాహం తర్వాత మరింత అందం, గ్లామర్ వచ్చినట్టుగా భావిస్తున్నా. పైగా పెళ్లి తర్వాత గ్లామర్‌గా కనిపించడం, ఎక్స్‌పోజింగ్ చేయడంలో తప్పులేదు' అని ఆమె అభిప్రాయపడ్డారు.



సూర్యోదయాన్ని వీక్షిస్తున్న పర్యాటకులు

కళకళలాడిన పర్యాటక ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటక ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రపంచ ప్రసిద్ధిచెందిన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతం కన్నియాకుమారికి ప్రతిరోజు దేశ, విదేశీ పర్యాటకులు వస్తుంటారు. విశేష, సెలవు రోజుల్లో పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటోంది. ఆ ప్రకారం, ఆదివారం వేకువజామునే పర్యాటకులు పెద్దసంఖ్యలో వచ్చారు. త్రివేణి సంగమంలో గుమిగూడిన పర్యాటకులు, సూర్యోదయాన్ని వీక్షించి పరవశించిపోయారు. అనంతరం పుణ్యస్నానాలు ఆచరించి భగవతి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే, వివేకానంద రాక్ మెమోరియల్ ఫోర్ట్, తిరువళ్లూర్ విగ్రహాలను సందర్శించారు. ఇక, గాంధీ స్మారక మందిరం, కామరాజర్ మండపం, ప్రభుత్వ మ్యూజియం, లైట్ హౌస్, భరతమాత ఆలయం, రామాయణ చరిత్ర చిత్ర ప్రదర్శన హాలు, తిరుపతి వెంకటాచలపతి తదితర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి.



కుట్రాలం జలపాతం వద్ద పర్యాటకులు

కుట్రాలం జలపాతం...

తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతంలో పర్యాటకులు స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. చిరుజల్లులు కురుస్తూ రమ్యమైన వాతావరణం నడుమ పిల్లలు, పెద్దలు జలపాతం వద్ద స్నానాలు చేశారు. ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం తదితర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి.

తిరుచెందూర్‌లో రెండో రోజూ వెనక్కి వెళ్లిన సముద్రం



పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్‌లో ఆదివారం కూడా సముద్రం వెనక్కి వెళ్లింది. తిరుచెందూర్ మురుగన్ ఆలయ సమీపంలోని సముద్రం అమావాస్య, పౌర్ణమి రోజుల్లో వెనక్కి వెళ్లడం సాధారణం. ఆ ప్రకారం, పౌర్ణమి సందర్భంగా శనివారం తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం అయ్యా వైకుంఠ అవతారపతి సమీపంలోని సముద్రం సుమారు 60 అడుగుల వెనక్కి వెళ్లడంతో, పాచిపట్టిన బండరాళ్లు బయటపడ్డాయి. ఆ రాళ్లపై నిలబడి భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు. ఈ క్రమంలో,రెండో రోజైన ఆదివారం కూడా సముద్రం సుమారు 70 అడుగుల వెనక్కి వెళ్లింది. కానీ, ఆలయ సమీపంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే సముద్ర ప్రాంతం సహజ స్థితిలో ఉండడంతో, భక్తులు భయాందోళనలు లేకుండా పుణ్యస్నానాలు ఆచరించారు.

వారి హయాంలోనే రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి

● అన్నాడీఎంకేపై మంత్రి మూర్తి ధ్వజం

చెన్నై, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ పాలనలోనే రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి జరిగిందని, ఈ వ్యవహారం సీబీఐ విచారణలో ఉండడంతో తాను పూర్తిగా వివరాలు తెలపలేనని వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి పి.మూర్తి తెలిపారు. మదురైలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్లపై 10 శాతం మేర నగదు పొందుతున్నారని ప్రతిపక్ష నేత ఎడప్పాడి ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఎక్కడ అవినీతి జరిగిందో ఆయన వెల్లడించాలన్నారు. తమ హయంలో రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు చేపడతామని ఇదివరకే హెచ్చరించామని మంత్రి తెలిపారు.

అన్నాడీఎంకే మాజీ ఎంపీ పదవి తొలగింపు

● ఎడప్పాడి చర్యలు

అడయార్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్‌కు మద్దతుగా నిలిచిన ఆ పార్టీకి చెందిన మాజీ ఎంపీ సత్యభామపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి వేటు వేశారు. పార్టీ కార్యవర్గ కమిటీ సభ్యత్వాన్ని రద్దు చేశారు. అన్నాడీఎంకేకు దూరమైన పార్టీ నేతలను తిరిగి ఒక్కటి చేసే విషయంపై సెంగోట్టయ్యన్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడికి 10 రోజుల గడువు విధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ సత్యభామ... సెంగోట్టయ్యన్‌కు మద్దతు ప్రకటించడంతో పాటు జిల్లా మహిళా విభాగం కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. ఆగ్రహించిన ఎడప్పాడి ఆమెను పార్టీ కార్యవర్గ సభ్యత్వం నుంచి తప్పించా రు.

డీఎంకేలోకి అన్నాడీఎంకే కార్యకర్తలు

● మంత్రి రాజాకన్నప్ప వెల్లడి

అడయార్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తుండటంతో అన్నాడీఎంకే కార్యకర్తలు డీఎంకేలో చేరుతున్నారని మంత్రి రాజా కన్నప్ప తెలిపారు. స్థానిక కొళత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కొత్తగా పార్టీలు స్థాపించి రాజకీయాల్లోకి వస్తున్న వారివల్ల ఎలాంటి మార్పు సాధ్యంకాదన్నారు. ఎంజీఆర్ కూడా 30 యేళ్లపాటు డీఎంకేలో ఉన్న తర్వాతే సొంతంగా పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. విజయకాంత్ 25 లక్షల మందితో మహానాడును నిర్వహించారన్నారు. హీరో విజయ్ నిర్వహించిన మదురై మహానాడును చూసి తాము భయపడటం మంత్రి రాజాకన్నప్ప చెప్పారు.

ముగిసిన కంచి స్వాముల చతుర్మాస దీక్ష



నగరవనంలోని ఉద్యానవనంలో కంచి స్వాములు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుపతి ద్వారకానగర్‌లోని కంచి కామకోటి మహాపాదుక మండపంలో పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి, సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి చేపట్టిన చతుర్మాస దీక్ష ఆదివారం ముగిసింది. ఇక్కడి పీఠం మండపంలో జూన్ 7వ తేదీన కంచి స్వాములు చతుర్మాస దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో భాగంగా పాదుక మండపంలో పలు పూజలు, వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. దీక్ష ముగింపు సందర్భంగా ఆదివారం పాదుక మండపం నుంచి నగరవనం వరకు విశ్వరూప యాత్ర నిర్వహించారు. నగరవనం చేరుకుని భగవద్గీత 11వ అధ్యాయంలోని విశ్వరూపయోగ పారాయణం చేశారు. అనంతరం ఊరేగింపుగా పాదుక మండపం చేరుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు కంచి స్వాములు ఆశీర్వచనాలు అందించారు. మంగళవారం వరకు కంచి స్వాములు పాదుక మండపంలోనే ఉండి తర్వాత కంచి పీఠానికి వెళ్లనున్నారు. నాడు విజయేంద్ర సరస్వతి తొలి చతుర్మాస దీక్ష ఆంధ్రప్రదేశ్‌లో జరగ్గా.. ఇప్పుడు సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి తొలి దీక్ష కూడా రాష్ట్రంలోనే జరగడం గమనార్హం.

దసరా వేడుకలకు కులశేఖరపట్టినం సిద్ధం

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉసన్‌కుడి, కులశేఖరపట్టినం తదితర ప్రాంతాల్లో భక్తులు ధరించే వేషధారణ వస్తువుల విక్రయాలు ఊపందుకున్నాయి. తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినం ముత్తారమ్మన్ ఆలయ దసరా వేడుకలు ఈ నెల 23వ తేది పతాకావిష్కరణతో ప్రారంభం కానున్నాయి. వేడుకల్లో ప్రధానాంశమైన మహిషాసుర సూరసంహారం అక్టోబరు 2వ తేది అర్ధరాత్రి 12 గంటలకు జరగనుంది. ఈ దసరా వేడుకలకు సుమారు 20 లక్షల మంది హాజరవుతారని అంచనా. అలాగే, తమ కోర్కెలు తీరాలంటూ భక్తులు 60 రోజులు, 41, 21, 11, 6 రోజులు అని మాలధారణ చేస్తుంటారు. కాళి, శివుడు, పార్వతి, బ్రహ్మ, విష్ణు, వినాయకుడు, మురుగన్, తాబేలు, కోతి, ఎలుగుబంటి, నర్సు, పోలీసు సహా 100కు పైగా వేషాధారణతో భక్తులు, పరిసర గ్రామాలకు వెళ్లి దేవత పేరుతో కానుకలు స్వీకరించి, వాటిని ఆలయ హుండీల్లో సమర్పించడం ఈ వేడుకల ప్రత్యేకత. వెలిగే కిరీటాలు, ఉంగరాలు, మణికట్టు పట్టీలు, బెల్టులు, గదలు, ఈటెలు, చెవి ఉంగరాలు, హనుమంతుడి ఉంగరాలు, బాణాలు, ఈటెలు తదితరాల తయారీ ఊపందుకుంది. కాళి వేషధారణ చేసే కిరీటం, జడ రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నారు. వేషధారణకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసే భక్తులతో ఉడన్‌కుడి, కులశేఖరపట్టినంలోని దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.



వేషధారణకు సిద్ధమైన వస్తువులు

వైభవంగా పాపనాశం మురుగన్ విగ్రహ కుంభాభిషేకం

పెరంబూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా పాపనాశం పడుగై పుదుతెరులో మర్రి చెట్టు కింద కొలువై ఉన్న సెల్వ వినాయకుడు, బాల అంజనేయుడు, కొత్తగా నిర్మించిన 12 అడుగుల మురుగన్ తదితర పరిహార దేవతలకు అష్టబంధన మహా కుంభాబిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. యాగపూజలతో ప్రారంభమైన వేడుకల్లో, వాస్తు శాంతి, గణపతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఆదివారం యాగశాల పూజలు ముగిసిన అనంతరం పుణ్యతీర్థంతో కూడిన కలశాలను మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం సెల్వవినాయకుడు, బాల ఆంజనేయుడు, వల్లీ, దేవసేన సమేత మురుగన్, నరసింహమూర్తి, మారియమ్మన్, నవగ్రహాలు, 12 అడుగుల ఎత్తున్న మురుగన్ తదితర ఉత్సవమూర్తులు, రాజగోపురంపై పుణ్య జలాలను ప్రోక్షించి మహాకుంభాబిషేకం నిర్వహించారు. అనంతరం పుణ్యజలాలను భక్తులపై చల్లారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



12 అడుగుల ఎత్తైన మురుగన్ విగ్రహానికి కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భక్తుల కలల సాకారమే బంగారు తల్లికి బంగారు రథం

● ఎస్‌కేపీడీ ట్రస్టీలు

ప్యారీస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భక్తుల కలల సాకారంతోనే 'బంగారు తల్లికి బంగారు రథం' ప్రణాళికను అమలు చేసినట్టు శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) చారిటీస్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక జార్జిటౌన్‌లో మూడు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన ఎస్‌కేపీడీ ట్రస్టీలు గత ఏడాది జరుపుకున్న నవరాత్రి వేడుకల సందర్భంగా బంగారు తల్లికి బంగారు రథం పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ మహోన్నత పథకానికి పలువురు దాతలు, భక్తులు ధన, వస్తు రూపేణ సహకారం అందించారు. ఇందులో భాగంగా కళాత్మకంగా రూపొందించిన బంగారు పూత రథ ప్రారంభోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ మహామండపంలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల మధ్య పూజలు, హోమాలు, పూర్ణాహుతి, అమ్మవారి అలంకారం, మహాదీపారాధన పూజలను ఆలయ వైదికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ధర్మకర్త, ప్రెసిడెంట్ కొల్లా వెంకట చంద్రశేఖర్, ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, దేసు లక్ష్మీనారాయణ, ఎస్.ఎల్.సుదర్శనం, టీవీ.రామ్‌కుమార్, సీఆర్ కిషోర్‌బాబు, తాతా బద్రినాథ్, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులందరికీ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



బంగారు రథం ప్రారంభోత్సవంలో ఎస్‌కేపీడీ నిర్వాహకులు

బీజేపీ కార్యాలయానికి బాంబు బెదిరింపు

చెన్నై, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో బీజేపీ కార్యాలయానికి బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. స్థానిక టి.నగర్‌లో బీజేపీ ప్రధాన కార్యాలయం కమలాలయం పనిచేస్తోంది. ఈ కార్యాలయానికి 24 గంటలు పోలీసు భద్రత ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఈ కార్యాలయంలో బాంబు ఉంచినట్లు పోలీసు కంట్రోల్ రూంకు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో, ఆదివారం ఉదయం ఐదుగురు బాంబ్ స్క్వాడ్ నిపుణులతో కూడిన బృందం కార్యాలయానికి చేరుకుని తనిఖీలు చేపట్టి, బెదిరింపు కాల్ ఫేక్ కాల్‌గా గుర్తించి, బెదిరింపుకు పాల్పడిన వారి కోసం విచారణ చేపట్టారు.

అలరించిన బలరామ్ ధమాకా



బలరామ్ ధమాకా కార్యక్రమంలో వాసవీ క్లబ్‌ల ప్రతినిధులు

ప్యారీస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ502ఏ నిర్వహణలోని వాసవీ క్లబ్ చెన్నై వనితా గ్రాండ్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోడంబాక్కం ఎంఆర్ హాలులో నిర్వహించిన 'బలరామ్ ధమాకా-2025' అలరించింది. రిజియన్-2 చైర్పర్సన్ ఎంఎస్‌వీ.రామ్ దంపతుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వీసీఐ ఇంటర్నేషనల్ డైరెక్టర్ కే.ఎన్.సురేంద్రన్, ఐపీసీ ఆర్.రంగనాథన్, కాన్ఫరెన్స్ చైర్మన్ కె.ప్రభాకరన్‌తో పాటు 8 వాసవీ క్లబ్‌ల నిర్వాహకులు, సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సమాజానికి అంకిత భావంతో సేవలందిస్తున్న వాసవీయన్లను బలరామ్ ధమాకా నిర్వాహకులు జ్ఞాపికలు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

సెంగోట్టయ్యన్‌తో భేటీ అవుతా

● ఓపీఎస్

అడయార్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విడిపోయిన అన్నాడీఎంకే నేతలంతా మళ్లీ ఐక్యం కావాలని పార్టీ సీనియర్ నేత కేఏ సెంగోట్టయ్యన్ (కేఏఎస్) పిలుపులో ఎలాంటి దోషం లేదని, ఆయతో త్వరలోనే భేటీ అవుతానని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం అన్నారు. మాజీ మంత్రి కేఏఎస్‌పై అన్నాడీఎంకే అధిష్ఠానం చర్యలు తీసుకోవడంపై ఓపీఎస్ స్పందించారు. కేఏఎస్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని, అన్నాడీఎంకే కార్యకర్తల పార్టీగా ఎంజీఆర్ తయారు చేస్తే దాన్ని మహావృక్షంలా జయలలిత చేశారన్నారు. కానీ, ఇపుడు ఆ పార్టీకి చెందిన అనేక మంది నేతలు విడిపోయారని, వారంతా ఏకం కావాలని కోరుకుంటూ ఎడప్పాడికి పది రోజుల డెడ్‌లైన్‌ను కేఏఎస్ విధించడంలో ఎలాంటి తప్పులేదన్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత తాను కేఏఎస్‌ను కలుసుకుంటానని చెప్పారు.

కరోనా తర్వాత పెరిగిన గుండె సంబంధిత సమస్యలు

● మంత్రి ఎం.సుబ్రమణ్యం

చెన్నై, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరోనా తర్వాత గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక తాంబరం సమీపం ముప్పేడులో 1,500 మంది ఉపాధ్యాయులు పాల్గొన్న ఉపాధ్యాయ దినోత్సవాల్లో మంత్రి సుబ్రమణ్యం, తాంబరం ఎమ్మెల్యే ఎస్ఆర్ రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసిన మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ.. సైదాపేటలోని సూర్యన్ ఆలయ వీధి ట్యూషన్ సెంటర్ నడిపానన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతానికి వెళితే అక్కడి ప్రజలు తనను మంత్రి, ఎమ్మెల్యే అని పిలవరని, టీచర్ వచ్చాడని అంటారని, అంతకంటే సంతోషకరమైన మాట మరోటి ఉండదన్నారు. ఉపాధ్యాయ రంగంలో స్నేహపూర్వ వాతావరణం మరో శాఖలో లేదని మంత్రి అన్నారు. కరోనా తర్వాత పెరిగిన గుండె సంబంధిత సమస్యల నివారణకు ప్రజలు వ్యాయామం చేయాలని సూచించారు. ఎన్ని పనులు ఉన్నప్పటికీ గంట వ్యాయామం చేయడం ఆరోగ్యానికి మంచిదని మంత్రి సూచించారు.